క్లుప్తంగా

క్లా దొర సేవలు వెలకట్టలేనివి



మాట్లాడుతున్న తెళ్ల ప్రేమ్‌చంద్

ఒంగోలు: పేదలపై దాతృత్వాన్ని చూపడంలో జాన్ ఎవరెట్ క్లా సేవలు అమూల్యమైనవని తెళ్ల ప్రేమ్‌చంద్ అన్నారు. ఆదివారం స్థానిక ఎన్టీఆర్ కళాక్షేత్రంలో జాన్ క్లా దొర 157వ జయంతి కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 1876 నుంచి 1878 మధ్య కాలంలో పనికి ఆహార పథకం అందుబాటులోకి తెచ్చి బకింగ్‌హామ్ కెనాల్‌ను 3 మైళ్లు తవ్వించారన్నారు. పేద ప్రజలకు విద్య అందుబాటులో ఉండాలనే లక్ష్యంతో హెచ్‌సీఎం, ఏబీఎం విద్యాసంస్థలతోపాటు ఆసుపత్రులను కూడా స్థాపించారని, 1897లో ఒంగోలు గుండా రైలు మార్గం వేయించింది కూడా ఆయనే అని కొనియాడారు. కార్యక్రమంలో క్లా ఫాలోయర్స్ సంస్థ అధ్యక్షుడు పత్రా శామ్యూల్ సన్, ఉపాధ్యక్షులు జి.సందీప్, కార్యదర్శి టి.ఎడిసన్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం క్లా దొర చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

మహిళకు గృహం నిర్మించిన సూర్యశ్రీ ట్రస్ట్



వృద్ధురాలికి ఇల్లు అప్పగిస్తున్న దాతలు

ఒంగోలు అర్బన్: నగరంలోని వాసు కాలనీలో నివాసం ఉంటున్న పేద మహిళ మరియమ్మకు సూర్యశ్రీ ట్రస్టు గృహం నిర్మించి ఆదివారం ఆమెకు అప్పగించారు. కాలనీలో నివాసం ఉంటున్న మరియమ్మ ఓ టీ స్టాల్లో పనిచేస్తూ జీవనం సాగిస్తోంది. వర్షం కారణంగా ఆమె ఉంటున్న నివాసం కూలిపోవడంతో టాయిలెట్ రూమ్‌లో తలదాచుకుంటున్న విషయం తెలుసుకున్న సూర్యశ్రీ ట్రస్టు సభ్యులు.. దాతల సహకారంతో రూ.1.70 లక్షలు వెచ్చించి ఓ గృహ నిర్మించి ఆమెకు అప్పగించారు. ట్రస్టు వ్యవస్థాపకులు మురళీకృష్ణ, సభ్యులు సర్దార్‌బాషా, మారెళ్ల సుబ్బారావు, సత్తార్‌బాషా, షహనాజ్, మహి, తస్నీరు సురేష్, వేణుగోపాల్, నేరెళ్ల శ్రీనివాసరావు, వెంకట్, మేడికొండ సుబ్బారావు, చౌదరి తదితరులు పాల్గొన్నారు.

అనాథలకు భోజనం పంపిణీ




మహిళకు భోజనం పంపిణీ చేస్తున్న మదర్ థెరిసా హెల్పింగ్ ఆర్గనైజేషన్ సభ్యులు

కొత్తపట్నం: భిక్షాటన చేసే అనాథలు, వృద్ధులు, దివ్యాంగులకు మదర్ థెరిసా హెల్పింగ్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఆదివారం భోజనాలు పంపిణీ చేశారు. జరుగుమల్లి మండలానికి చెందిన పోకూరి రవీంద్రబాబు పుట్టిన రోజు సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో టీమ్ సభ్యులు డి.కేశవ, ఎం.సునీల్, డి.సుజిత్, ఎం.రాజ్‌కుమార్, ఎం.చంద్ర, బి.డాలియల్, ఎం.బాబు, ఎం.ప్రసాద్, ఎం.సన్ని, రజిత్ తదితరులు పాల్గొన్నారు.

మాలల సంక్షేమమే లక్ష్యం

- మాలమహానాడు రాష్ట్రగౌరవ అధ్యక్షుడు చెన్నయ్య



మాట్లాడుతున్న బిల్లా చెన్నయ్య

ఒంగోలు: మాలల సంక్షేమం, అభ్యున్నతే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు మాలమహానాడు రాష్ట్ర గౌరవ అధ్యక్షులు బిల్లా చెన్నయ్య పేర్కొన్నారు. ఆదివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు జి.చెన్నయ్య తన సేవలను గుర్తించి రాష్ట్ర గౌరవాధ్యక్షుడిగా ప్రకటించారన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, పీవీరావు ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తానని చెప్పారు. సమావేశంలో బత్తుల వెంకట్రావు, పాండ్ర నరసయ్య, పి.వెంకట సుబ్బారావు, పాలేటి కోటేశ్వరరావు, నలగండ్ల హరిబాబు, పి.అజయ్, సీహెచ్ గురవయ్య తదితరులు పాల్గొన్నారు.

హామీలపై ఒత్తిడి తెద్దాం

ఒంగోలు: రాష్ట్ర ప్రభుత్వం జిల్లా ప్రజానీకానికి ఇచ్చిన హామీలను వేగంగా అమలు చేసేలా ఒత్తిడి తీసుకువద్దామని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు పూనాటి ఆంజనేయులు పేర్కొన్నారు. స్థానిక సీపీఎం జిల్లా కార్యాలయంలో జిల్లాస్థాయి కార్యకర్తల శిక్షణ తరగతుల్లో ఆయన మాట్లాడారు. ఇళ్ల నిర్మాణం, తాగునీటి సమస్య పరిష్కరించడంతోపాటు మార్కాపురం మెడికల్ కాలేజీ, ఒంగోలు రిమ్స్ సూపర్‌స్పెషాలిటీ, ప్రకాశం యూనివర్సిటీ నిర్మాణాలు వేగంగా పూర్తి చేసేలా ఒత్తిడి తీసుకొద్దామన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు జీవీ కొండారెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో షేక్ మాబు, కంకణాల ఆంజనేయులు, చీకటి శ్రీనివాసరావు, వి.ఆంజనేయులు, జి.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇది కదా.. గ్రామ స్వరాజ్యం

దేశాభివృద్ధికి పల్లెలే పట్టుగొమ్మలు.. అలాంటి పల్లెల అభివృద్ధిని తెలుగుదేశం జమానాలో గాలికొదిలేశారు. అభివృద్ధి పనుల పేరుతో కేటాయించిన నిధులను పచ్చచొక్కాలు ఏకమై పప్పుబెల్లాల్లా పంచుకున్న తీరును చూసి జనం విస్తుపోయారు. ఏ పని మొదలుపెట్టినా పచ్చ గద్దలు అక్కడ వాలిపోయి పర్సంటేజీలు తన్నుకుపోయాయి. 2019 ఎన్నికల్లో టీడీపీ ఘోర ఓటమి చవిచూడటం.. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలు పట్టం కట్టడంతో గ్రామ స్వరాజ్యానికి పునాదులు పడ్డాయి. అభివృద్ధి పనులతోపాటు సంక్షేమ పథకాలతో పల్లె సీమల్లో 'నవశకం' మొదలైంది. గడిచిన నాలుగేళ్లలో ఒక్క కొండపి నియోజకవర్గంలోనే కేవలం అభివృద్ధి పనుల కోసం 200 కోట్ల రూపాయలకు పైగా నిధులు కేటాయించడం విశేషం.



కొండపిలో సుమారు రూ.50 లక్షలతో నిర్మించి ఇటీవల ప్రారంభించిన గ్రామ సచివాలయం

కొండపి నియోజకవర్గంలో రూ.200 కోట్లకు పైగా నిధులతో అభివృద్ధి పనులు

- 89 గ్రామ సచివాలయాల నిర్మాణానికి రూ.35.6 కోట్లు
- 90 రైతు భరోసా కేంద్రాలకు రూ.19.62 కోట్లు
- 62 హెల్త్ క్లినిక్‌లకు రూ.13.65 కోట్లు
- 55 బీఎంసీయూలకు రూ.9.7 కోట్లు
- 36 డిజిటల్ లైబ్రరీలకు రూ.7.76 కోట్లు
- తారు రోడ్ల నిర్మాణానికి రూ.40 కోట్లు
- 7,947 జగనన్న ఇళ్ల నిర్మాణానికి రూ.49 కోట్లు
- పొదిలి నుంచి మర్రిపూడి వరకు సాగర్ పైప్‌లైన్ ఏర్పాటుకు రూ.28.5 కోట్లు



నూతనంగా తారులేయర్ వేసిన పెట్లూరు- పొదిలి రహదారి

కొండపి: గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యాన్ని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సాకారం చేశారు. వైఎస్సార్ సీపీ అధికారం చేపట్టిన దరిమిలా కొండపి నియోజకవర్గం అభివృద్ధిలో శరవేగంగా ముందుకు సాగుతోంది. నియోజకవర్గంలో 89 గ్రామ సచివాలయాలు మంజూరు కాగా 76 సచివాలయ పనులు ప్రారంభించారు. వాటిలో 37 సచివాలయాల నిర్మాణం రూ.14.8 కోట్ల నిధులతో పూర్తి చేశారు. 90 రైతు భరోసా కేంద్రాలకుగాను 19.62 కోట్లు మంజూరు చేయగా రూ.9.16 కోట్లు వెచ్చించి 42 భవనాలు నిర్మించారు. మరో 32 భవనాల నిర్మాణానికి ఇప్పటి వరకు రూ.5.1 కోట్లు ఖర్చు చేయగా వివిధ దశల్లో ఉన్నాయి. విలేజ్ హెల్త్ క్లినిక్‌లు 62 మంజూరు కాగా రూ.2.5 కోట్ల ఖర్చుతో 16 భవనాలు పూర్తయ్యాయి. వివిధ దశల్లో ఉన్న 42 క్లినిక్‌లకు ఇప్పటి వరకు రూ.5.46 కోట్లు ఖర్చు చేశారు. అదే విధంగా ఆర్‌అండ్‌బీ శాఖ ఆధ్వర్యంలో రూ.1.70 కోట్లతో కామేపల్లిలోని పీహెచ్‌సీకి అదనపు భవనం, కాకర్ల పీహెచ్‌సీకి రూ.1.69 కోట్లతో అదనపు భవనాన్ని నిర్మిస్తున్నారు. ఈ పనులు చివరి దశకు చేరుకున్నాయి. బల్క్ మిల్క్ కూలింగ్ యూనిట్లకు సంబంధిం రూ.1.95 కోట్లు ఖర్చు చేసి 11 భవనాలు నిర్మించారు. 12 డిజిటల్ లైబ్రరీలకు సంబంధించిన పనులు వివిధ దశల్లో ఉన్నాయి.

మౌలిక వసతులకు పెద్దపీట

- కొండపి నియోజకవర్గంలో రోడ్ల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ఆర్‌అండ్‌బీ నిధులు రూ.43.5 కోట్లు మంజూరు చేసింది. ప్రధానంగా ఏళ్ల తరబడి అభివృద్ధికి నోచుకోని ఉళ్లపాలెం-వేములపాడు(ఓవీ) రోడ్డును 25 కి.మీ మేర డబుల్ లేన్‌గా నిర్మించేందుకు రూ.35 కోట్లు కేటాయించడంతో పనులు చకచకా సాగుతున్నాయి.
- టంగుటూరు-కొండపి రోడ్డులో సాధువారిపాలెం నుంచి పెట్లూరు గ్రామం వరకు సుమారు 21 కి.మీ రోడ్డుపై రూ.3.5 కోట్లతో తారు లేయర్ వేశారు.
- కొండపి నుంచి జాళ్లపాలెం వరకు సుమారు 12.4 కి.మీ రోడ్డుపై రూ.1.5 కోట్లతో తారు లేయర్ వేశారు.
- వీకేకే రోడ్డులో వావిలేటిపాడు నుంచి చిరికూరపాడు వరకు 12 కి.మీ రోడ్డుపై రూ.3.5 కోట్లతో తారు లేయర్ వేశారు.
- చిరికూరపాడులో రూ.15 లక్షలతో 400 మీటర్ల మేర డ్రెయినేజీ నిర్మించారు.
- జగనన్న కాలనీల్లో 7,947 ఇళ్లు మంజూరు కాగా ఇప్పటి వరకు 2,121 భవనాల నిర్మాణం పూర్తయింది. మిగిలిన ఇళ్ల నిర్మాణ పనులు వివిధ దశల్లో ఉన్నాయి. అందుకుగాను లబ్ధిదారులకు ప్రభుత్వం సుమారు రూ.48 కోట్లు విడుదల చేసింది.
- పొదిలి చిన్న చెరువు నుంచి గుండ్లసముద్రం మీదుగా మర్రిపూడి వరకు 11 కిలోమీటర్ల మేర సాగర్ పైప్‌లైన్ నిర్మించేందుకు రాష్ట్ర ప్రభుత్వం 28.5 కోట్ల రూపాయలు మంజూరు చేసింది. 9 గ్రామాలకు చెందిన 36 వేల మంది ప్రజల తాగునీటి, సాగునీటి అవసరాలు తీర్చే ఈ పనులకు సంబంధించి ఇరిగేషన్ అధికారులు సర్వే కూడా పూర్తి చేశారు. త్వరలోనే పనులు ప్రారంభించనున్నారు.
- వీటితో పాటు కొండపి నియోజకవర్గ ప్రజలకు కోట్లాది రూపాయల డబ్బును సంక్షేమ పథకాల రూపంలో నేరుగా అందించి వారి జీవితాల్లో వెలుగులు నింపింది. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా భావించి పాలన సాగిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి జనం జేజేలు పలుకుతున్నారు.



పెరిదేపిలో జగనన్న కాలనీలో నిర్మాణంలో ఉన్న ఇళ్లు

సచివాలయం సేవలు భేష్



సీఎం జగన్ నూతనంగా ఏర్పాటు చేసిన గ్రామ సచివాలయాల ద్వారా అందిస్తున్న సేవలు బాగున్నాయి. వలంటీర్లే ఇంటికి వచ్చి మరీ ఏ పథకానికి అర్హులమో చెప్పి సేవలు అందిస్తున్నారు. మా గ్రామంలో సైతం ప్రభుత్వం సుమారు రూ.50 లక్షలకు పైగా నిధులు ఖర్చు చేసి బ్రహ్మాండంగా నూతన సచివాలయ భవనాన్ని నిర్మించింది.

– ఎన్.బాలకోటయ్య, కొండపి

జగనన్న చలవతో ఇల్లు నిర్మించుకున్నాం



గ్రామంలోనే జగనన్న కాలనీలో ఒకటిన్నర సెంటు ఇంటి స్థలం జగనన్న ఇచ్చారు. అందులోనే ఇల్లు నిర్మించుకోవడానికి డబ్బు ఇచ్చారు. ఇల్లు కట్టుకున్నాను. ప్రస్తుతం ప్లాస్టరింగ్ పనులు చేయించుకుంటున్నా. త్వరలోనే ఇంట్లోకి చేరతా. జగనన్న రుణం తీర్చుకోలేనిది.

– జి.మరియమ్మ, పెదకండ్లగుంట

హెడ్మాస్టర్ల సంఘ కార్యవర్గం ఎంపిక

ఒంగోలు: ఏపీ హెడ్మాస్టర్ల సంఘం జిల్లా నూతన కార్యవర్గ ఎంపిక ఆదివారం స్థానిక హెడ్మాస్టర్ల సంఘం భవనంలో జరిగింది. ఎన్నికల అధికారిగా రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు పి.వెంకట రమణారావు హాజరయ్యారు. ఈ సందర్భంగా హెడ్మాస్టర్ల సంఘం భవన నిర్మాణంలో కీలక పాత్ర పోషించిన పి.అర్లారెడ్డి మాట్లాడుతూ హెడ్మాస్టర్ల సంఘం భవనం విద్యార్థుల ప్రగతికి, హెడ్మాస్టర్ల సమస్యల పరిష్కారానికి వేదికగా మారాలని ఆకాంక్షిస్తున్నామన్నారు. నూతన కార్యవర్గం ఈ దిశగా భవనంలో కార్యక్రమాలు ముమ్మరం చేయాలని సూచించారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేశారు.



టీఎల్ కాంతారావు



ప్రధాన కార్యదర్శి వై.వెంకట్రావు



జీఎస్ఆర్ సాయి

నూతన కార్యవర్గం ఇదే

టీఎల్ కాంతారావు–జిల్లా అధ్యక్షులు(బండ్లమూడి జెడ్పీహెచ్ఎస్), వై.వెంకట్రావు–ప్రధాన కార్యదర్శి(ఉప్పలపాడు జెడ్పీహెచ్ఎస్), జీఎస్ఆర్ సాయి–కోశాధికారి(కురిచేడు జెడ్పీహెచ్ఎస్), రాష్ట్ర కౌన్సిలర్లుగా ఎం.శ్రీనివాసులు(జరుగుమల్లి జెడ్పీహెచ్ఎస్), షేక్ ఖాదర్‌మస్తాన్(దర్శి జెడ్పీహెచ్ఎస్), ఎం.శివరామకృష్ణ(ముండ్లమూరివారిపాలెం), మహిళా కార్యదర్శులుగా కె.వసంతకుమారి(పెద కొత్తపల్లి జెడ్పీహెచ్ఎస్), కె.మహాలక్ష్మి(సింగరాయకొండ జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల)

మాస శివరాత్రికి ప్రత్యేక హోమాలు



త్రిపురాంతకం ఆలయంలో పూజలు

త్రిపురాంతకం: పార్వతి సమేత త్రిపురాంతకేశ్వరస్వామి ఆలయంలో మాస శివరాత్రి సందర్భంగా ప్రత్యేక హోమాలు నిర్వహించారు. త్రిపురాంతకంలోని ఆలయంలో మాస శివరాత్రిని పురస్కరించుకుని గణపతి హోమం, నవగ్రహ హోమం, రుద్రహోమం వేదపండితులు నిర్వహించారు. అర్చకుడు విశ్వనారాయణ శాస్త్రి ప్రత్యేక పూజలు చేయగా, ఈఓ చెన్నకేశవరెడ్డి, ట్రస్ట్‌బోర్డు మాజీ సభ్యులు సుబ్బారావు, మల్లికార్జున్ పాల్గొన్నారు.

కిట్స్‌లో ముగిసిన టీచర్ల శిక్షణ

మార్కాపురం: విద్యార్థులకు ఆధునిక పద్ధతుల్లో బోధన చేయాలని కిట్స్ ఇంజినీరింగ్ కళాశాల సెక్రటరీ అన్నా కృష్ణచైతన్య చెప్పారు. స్థానిక కిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో మార్కాపురం డివిజన్‌లోని వివిధ పాఠశాలలకు చెందిన 767 మంది ప్రభుత్వ ఉపాధ్యాయులకు గత 12 రోజులుగా నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమం ఆదివారం ముగిసింది. ముఖ్య అతిథిగా హాజరైన చైతన్య మాట్లాడుతూ బైజూస్ యాప్, డిజిటల్ క్లాస్‌రూముల ద్వారా విద్యార్థులకు బోధన చేయాలని చెప్పారు. దీనితోపాటు విద్యా బోధనలో స్మార్ట్ టీవీల వాడకం, ఐఎఫ్‌పీఎస్‌లు కూడా వచ్చాయన్నారు. శిక్షణ కార్యక్రమంలో తెలుసుకున్న ఆధునిక పద్ధతులను విద్యార్థులకు వివరించాలన్నారు. కోఆర్డినేటర్ డాక్టర్ అల్తాఫ్ హుస్సేన్‌బాషా, ట్రైనర్లు కె. రాముడు, జి. వెంకటేశ్వర్లు, నబీ, జిలానీ, అమృతవల్లి, స్వరూపారాణి, రాజు, రవికుమార్‌లు వ్యవహరించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కృష్ణారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ రంగనాయకులు, ఏఓ ప్రభాకర్, కోర్సు డైరెక్టర్ మార్కాపురం ఎంఈఓ–2 శ్రీనివాసులు పాల్గొని పలు సూచనలు చేశారు.



మాట్లాడుతున్న ఎంఈఓ శ్రీనివాసులు

సొంతూరులోనే నీళ్లివ్వడం లేదు.. నియోజకవర్గానికి ఏం చేస్తాడు?



తూర్పునాయుడుపాలెంలో కాఫీ విత్ గృహసారథిలో వరికూటి

- ఎమ్మెల్యే డోలా తీరుపై తూర్పునాయుడుపాలెం వాసుల ఆగ్రహం
- కాఫీ విత్ గృహసారథిలో అశోక్‌బాబుకు సమస్యల నివేదన

టంగుటూరు: మండలంలోని తూర్పునాయుడుపాలెంలో ఆదివారం వైఎస్సార్ సీపీ కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు ఆధ్వర్యంలో కాఫీ విత్ గృహసారథి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గృహసారథి మీసాల శ్రీను నివాసాన్ని వరికూటి సందర్శించి సమస్యలు తెలుసుకున్నారు. తమ క్లస్టర్ల పరిధిలోని ప్రజలకు వలంటీర్ల సహాయంతో వెంటనే పరిష్కరించాలని సూచించారు. ఎస్టీ కాలనీలో ప్రధానంగా రోడ్లు, సైడు కాలువలు లేనందున వర్షం నీటితో తీవ్ర ఇబ్బంది పడుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే సొంత గ్రామంలో గుక్కెడు మంచి నీటి కోసం వెంపర్లాడాల్సి వస్తోందన్నారు. ఎమ్మెల్యే ఇంటికి, గ్రామానికి కిలోమీటరు దూరంలో ఉన్న దామచర్ల సత్య కంపెనీకి 110 ఎంఎం పైపులు వేసుకుని, గ్రామస్తులకు మాత్రం 25 ఎంఎం పైపులు వేశారని, దీంతో నీరు సక్రమంగా సరఫరా కావడం లేదని వివరించారు. దీనిపై వరికూటి స్పందిస్తూ.. తొమ్మిదేళ్లుగా ఎమ్మెల్యేగా ఉంటున్న డోలా, అలాగే టీడీపీ సానుభూతిపరుడైన సర్పంచి కలిసి గత ఎనిమిది నెలలుగా ప్రజలకు మంచి నీరు సరఫరా చేయకపోవడం దారుణమన్నారు. ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో నీటి సమస్యను ఉద్దేశపూర్వకంగానే పక్కనపెట్టినట్లుందన్నారు. పంచాయతీ వారికి ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోకపోవడాన్ని తప్పుబట్టారు. నిత్యం అభివృద్ధి అని మాట్లాడే ఎమ్మెల్యే స్వామి దీనికి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. సొంత గ్రామంలోనే మౌలిక వసతులు కల్పించలేని స్వామి నియోజకవర్గ ప్రజలకు ఏమి చేస్తాడని తూర్పునాయుడుపాలెం వాసులు ఈ సందర్భంగా వ్యాఖ్యానించడం గమనార్హం. కాగా.. కాలనీలో నీటి సమస్య తలెత్తకుండా ట్యాంకర్లతో సరఫరా చేయాలని స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు దామచర్ల అనీల్, దామచర్ల బుజ్జికి సూచించారు. కార్యక్రమంలో దామచర్ల పూర్ణచంద్రరావు, దినేష్, హరినారాయణ, నాగరాజు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం స్వాధీనం

మార్కాపురం టౌన్: బేస్తవారపేట నుంచి నేషనల్ హైవేపై వాహనంలో అక్రమంగా తరలుతున్న 60 బస్తాల రేషన్ బియ్యాన్ని ఆదివారం రాత్రి మార్కాపురం మండలం కుంట వద్ద స్వాధీనం చేసుకున్నట్లు రేషన్ గోడౌన్ డిప్యూటీ తహసీల్దార్ ఎస్. చంద్రశేఖర్ తెలిపారు. బియ్యాన్ని స్వాధీనం చేసుకుని నిందితుడిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు.



రేషన్ బియ్యం వాహనం వద్ద డీటీ చంద్రశేఖర్

220 మందికి వైద్య పరీక్షలు



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ కీర్తి

బేస్తవారిపేట: మండలంలోని జేసీ అగ్రహారంలో కంభం వెంకటేశ్వర మల్టీస్పెషాలిటీ వైద్యశాల ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ ఎంవీ సందీప్ కుమార్, కె. కీర్తి, బీపీ రంగనాయకులు 220 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. సర్పంచ్ మేకల రాజేశ్వరి, కోనపల్లె మాజీ సర్పంచ్ నాదేళ్ల శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఏపీటీఎఫ్ నాగులుప్పలపాడు సబ్ కమిటీ ఎన్నిక



ప్రమాణ స్వీకారం చేస్తున్న నాగులుప్పలపాడు సబ్ కమిటీ సభ్యులు

ఒంగోలు: ఏపీటీఎఫ్ నాగులుప్పలపాడు సబ్‌కమిటీ అధ్యక్షునిగా టి.ఈశ్వరయ్య, ప్రధాన కార్యదర్శిగా షేక్ మౌలాలిని ఎన్నుకున్నారు. ఆదివారం స్థానిక ఏపీటీఎఫ్ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన ఎన్నికను రాష్ట్ర కార్యదర్శి బి.రఘుబాబు, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వి.జనార్దన్‌రెడ్డి, డి.శ్రీనివాసులు తదితరులు పర్యవేక్షించారు. ఎన్నికల అధికారిగా బి.శేషారావు, పరిశీలకుడిగా ఎం.యోహాన్‌రెడ్డి వ్యవహరించారు.

నీటి కుంటలో పడి వ్యక్తి మృతి

పులివెందుల: పట్టణంలోని రాయలాపురం బ్రిడ్జి వద్ద ఉన్న నీటి కుంటలో పడి వ్యక్తి మృతి చెందాడు. వివరాల్లోకి వెళితే..పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా ఉలవలపాడు గ్రామానికి చెందిన పోతురాజు(38) పులివెందులకు కొన్ని నెలల క్రితం వచ్చి బేల్దారీ పనులు చేస్తున్నాడు. ఈ క్రమంలో ఆదివారం మరికొంత మందితో కలిసి సరదాగా రాయలాపురం బ్రిడ్జి వద్ద ఉన్న నీటి కుంటలో ఈత కోసం వెళ్లాడు. ఈ నేపథ్యంలో ఆయన ఈత కొడుతూ నీటిలో కనిపించకుండా గల్లంతయ్యాడు. దీంతో అక్కడి వారు వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది, రెస్క్యూ టీం నీటి కుంటలో గాలింపు చర్యలు చేపట్టారు. నీటిలో మునిగి చనిపోయిన పోతురాజును బయటకు తీశారు. అనంతరం మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. పోతురాజుకు భార్యతోపాటు ముగ్గురు పిల్లలు ఉన్నారు.